# సంబంధాలు

"అమ్మా! అన్నయ్యకి నచ్చిందేవ్?" పొలికేకపెట్టి— చప్పట్లు కొడుతూ పకపకా నవ్వుతూ—"అన్నయ్య పెళ్ళి కొడుకాయెనే! మా అన్నయ్య పెళ్ళికొడుకాయెనే!" అంటూ చిన్నపిల్లలా అల్లరిచేసింది ప్రమీల.

"నిజంగానే న్రా?" అంటూ వచ్చింది వాళ్ళమ్మ సంబరంగా. రావు ముసిముసిగా నవ్వేశాడు. కొడుకు మొహంచూస్తే ఆ తల్లికి నేత్రానందమైంది – పెళ్ళి విష యంలో అంతప్రసన్నత ఎన్నడూ ప్రదర్శించలేదు రావు.

వాళ్ళమ్మకి చాలాధైర్యం వచ్చింది—"రేపు పిల్లని చూడ్డానికి వెళ్దామా?" అంది.

రావు ఓనవ్వువిసిరి పేపర్లో తలదూర్చేసు కున్నాడు.

* * *

రావు డైరీలనిండా చాలామంది అమ్మాయిలమీద వర్ణన లుంటాయి. అంతకన్నా ఎక్కువగా విమర్శలే వుంటాయి.

అబ్బాయిలందర్లాగే రావుకూడా కలల్లో కొట్టుకు పోతూంటాడు—రావుకి ఓ స్వప్నసుందరి వుంది.

ఆ సుందరి గులాబీల్లోని మృదుత్వం—పారిజాతాల్లోని పవిత్రం—కలువ రేకుల్లోని సౌందర్యం—సన్నజాజుల్లోని పరిమళం—ఇమిడి వుంటుంది.

మేను బంగారుతీగలా మిసమిసలాడుతూ — తళుకు లీనుతూ వుంటుంది.

రావుకి కవిత్వంరాదు. అయినా తన స్వప్నసుందరిని వీక్షించినంత మాత్రాన కవిత్వం వచ్చితీరాలి. కనీసం "కవిత్వం రాకపోయిందే!" అన్న ఏడుపేనా రావాలి.

తర్వాత—ఆ స్వప్నసుందరి చదువుకున్నది. చాలా చదువుకున్నది.

చదువుకోని మనిషి రెండుకాళ్ళ పశువు—అలాంటి పశువుల్తో జీవిత సంబంధాలు రావుకిష్టంలేదు.

మూడోది...నాలుగోది ... ఆరోది ... చాలా ఆశలున్నాయి. కలలుకనటం రావుకో హాబీ! ఆ కలల్ని కవితా ధోరణిలో కుదించి రాసుకోవటం మరోహాబీ!

ఓసారి ప్రమీల రావు డైరీ చదివేసింది.

అన్నాల దగ్గిర చెప్పెయ్యబోయింది—"అన్నయ్యకి అందమైన పెళ్ళాంకావాలిట. ఆవిడెలా వుండాలిటా..."

నోరునొక్కేశాడు రావు—"ఏం? నీకు అందమైన మొగుడు అక్కర్లేదూ?"

ప్రమీల పెనుగులాడి విడిపించుకునేలోపు బామ్మ తన అమూల్యమైన అభిప్రాయాన్ని వెల్లడిచేసింది మొగాడికి అందం ఏవిట్రా? మొగపుట్టుకే అందం.

ప్రమీల చురచురా చూసింది.

"అవునే బామ్మా! ఏ మగవాడైనా అందగాడే కదూ?" చెల్లెల్ని వుడికిస్తూ అడిగాడు రావు.

"కాకేమీ? మీ తాతకి పాతికేళ్ళప్పుడు...."

అన్నం వదిలేసి వంటింట్లోంచి పరిగెత్తాడు రావు.

రావు అభిరుచి యింట్లో అందరికీ తెలిసిందే! చదువు ముగించి వుద్యోగంలో చేరి రెండు మూడేళ్ళు కావస్తోన్నా కొత్త కొత్త కలలు కంటూనేవున్నాడు. కానీ...ఇన్నాళ్ళకి... రావు...కలగన్న సుందరి కన్పించింది.

కమల ఫోటో రావుకి చాలా నచ్చింది.

* * *

పెళ్ళిచూపులు సర్వసాధారణంగానే జరిగాయి. కమల బంగారం బొమ్మలాగేవుంది—అప్పుడే విచ్చుకున్న కమలం లాగేవుంది. రావుని మత్తెక్కించిన స్వప్న సుందరిలాగేవుంది.

అదీగాక కాలేజీలో చదువుకుంటోంది కూడాను. పెద్దవాళ్ళడిగిన మాటల కన్నిటికీ హంసలాకులుకుతూ జవాబు చెప్పింది. కంఠం కోయిల గొంతులా శ్రావ్యంగావుంది.

మొత్తానికి కమల చాలా అందంగానేవుంది.

అయితే...రావు మొహంలో మందహాసంమాత్రం మాయమైంది. ఆ ప్రసన్నతకి బదులు విసుగూ చిరాకూ— చోటుచేసుకున్నాయి.

"అన్నయ్యా! వదినెలావుంది?" అంది బండి ఎక్కగానే ప్రమీల.

"ఛీ! వూరుకో! ఏమిటావరసలు?"

"ఏం? నీకు నచ్చలేదూ?"

"నాకేం నచ్చలేదు"

తెల్లబోయింది ప్రమీల

ఇంటికి వెళ్ళీవెళ్ళగానే తల్లి అడిగింది—"ఏమిట్రా? ప్రమీలేదో అంటోందీ!

"అవును"

"అవునేమిటి? నీకెందుకు నచ్చలేదుటా?"

"నన్నేం అడక్కు" విసుక్కున్నాడు రావు.

"ఇదేం ఖర్మరా దేవుడా! వీడికిక పెళ్ళయ్యే రాత వుందోలేదో! పిల్ల అందాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవు. ఆడవాళ్ళకే మనస్సు చెదురుతోందిగదా? ఇంత కాలం మురిసి మురిసి...చివరికి వీడు బ్రహ్మచారిలావుంటాడా ఏమిటి?" అంటూ ఆవిడ అత్తగారిదగ్గిర ఏకరువుపెట్టింది.

"పిచ్చి సన్యాసి! వాణ్ణిరానీ! నేగట్టిగా అడుగుతాను." అని అభయమిచ్చింది అత్తగారు.

"మళ్ళా యిప్పుడు వీడికి సంబంధం ఎక్కడాచూడ్డం? ప్రమీల పెళ్ళీ వీడిపెళ్ళీ కలిపిచేసేద్దాం అనుకున్నాంగా?

అన్నయ్య రేపోమాపో ప్రమీల సంబంధం కబురు తేనే తెస్తాడు." అంటూ పోయిందావిడ.

ఆ సాయంత్రానికి ప్రమీల మేనమామ రానేవచ్చాడు విశాఖపట్నంనుంచి—అన్నగారి మొహంచూస్తే సంబంధం కుదుర్చేసుకు మరీ వచ్చాడనిపించిందా తల్లికి.

"ఏం అన్నయ్యా? ఏం చేసుకువచ్చావు? కాయా? పండా?"

"పండుకాక కాయ అవుతుందా? కుర్రాణ్ణి చూసి వచ్చాను." ప్రమీల తలుపుచాటుననక్కింది. రావు మేన మామదగ్గిరికి వచ్చి కూర్చున్నాడు.

"అయితే ఏం మాట్లాడావు?"

"నేను వాళ్ళనాన్నగారికి తెలిసిన వాణ్ణనీ చూసిపోదా మనీ వచ్చాననీ చెప్పాను. వివరాలు తర్వాత చెప్దామను కున్నాను. కానీ..."

"ఊఁ! కానీ ఏవిటి?"

"ఆ కుర్రాడు బొత్తిగా పసిబాలుడేం కాదుగదా? వుద్యోగంచేసి నూట నలభై రూపాయలు తెచ్చుకుంటు న్నాడుగదా?"

"అందుకేకదూ? విశేషంగా పిల్ల సుఖపడుతుందనీ..."

"చెప్తాను వినుమరీ! గదినిండా సిగరెట్టు పీకలు--చిత్తు కాయితాలు—చొక్కాలు—లాగూలూ—పుస్తకాలు అబ్బ! ఏం గందరగోళం—అయ్యో! "పోనీలే మొగవాడేం సర్దుకో

గలడులే" అనుకున్నా కడుపులో. బస్సుదిగి చీకట్నే వెళ్లాను కదా మళ్ళా దొరుకుతాడో దొరకడో అని నే వెళ్ళేసరికి ఇంటి వారి చీడీలమీద కూర్చుని మొహం కడుక్కుంటున్నాడు. నన్ను గదిలో కూర్చోబెట్టాడు. కాఫీ తెప్పించి యిచ్చాడు. "కూర్చోండి నేను మొహంకడుక్కువస్తాను." అని సబ్బు పెట్టి పట్టుకు బాత్‌రూంలోకి వెళ్ళి రెండు నిముషాల్లో వచ్చాడు. స్నానంచెయ్యలేదు. గుడలువిప్పలేదు. రామ చంద్రా! ఒంటిమీదవున్న ఆ బనీనుచూస్తే వాంతి రాబో యింది. నల్లగా మురికి గుడ్డలామాసి మట్టికంపు కొడుతూంది. చెమటతో మచ్చలు కట్టివుంది. కుర్రాణ్ణి పైకీ కిందకీ ఎగా దిగా చూశాను. జుట్టుమాసి బట్టలు అట్టలు కట్టినట్టువుంది. వెంట్రుకల చివర మట్టిముద్దలు నా చత్వారం కళ్ళకికూడా కన్పించి ఛస్తేను!"

"అయితే! యింతకీ!...."

"పెళ్ళికబురే ఎత్తలేదు నేను" నువ్వు ఖులాసాగానే వున్నావని మీ నాన్నగారికి చెప్తానబ్బాయ్!" అనేసి బయటబడ్డాను.

బుగ్గలునొక్కుకుంది ప్రమీలతల్లి — "మరి కాయా? పండా? అని అడిగితే పండన్నావ్."

"పండుకాదూమరి? అలాంటి జిడ్డు దౌర్భాగ్యుడికి పిల్లనివ్వడం తప్పింది.— ఇదిగో అమ్మాయ్! నువ్వు విచా రించకు. శుభ్రతలేనిచోట లక్ష్మీదేవినిలవదు. ఆరోగ్యంలేని చోట అష్టదరిద్రాలూ వుంటాయి."

"ఊఁ బావుంది. అయితే యిది విన్నావూ ? రావు కూడా పిల్లనచ్చలేదనేశాడు."

"ఏంరా ? ఈ పిల్ల బాగా నేవుందిగా ఫోటో కాయితంలో ! నీకు నచ్చనేలేదూ ?" కళ్ళద్దాలు సరిచేసుకుంటూ అడిగాడు మేనమామ.

రావు గొంతు సర్దుకున్నాడు. ధైర్యం పుంజుకున్నాడు—

నాకు కన్పించిన కారణం పైకి చెప్పే ధైర్యం లేక పోయింది ఇప్పటివరకూ. కానీ నువ్వు చెప్పినట్టు చెమటబనీను ఓ పెళ్ళి చెడగొట్టిందంటే నాకూ ధైర్యంవస్తోంది— ఆ పిల్లని వీళ్ళెవరూ పరీక్షగా చూసివుండరు. నేను సిగ్గువిడిచి చూస్తూనే వున్నాను. సోఫాలోకూర్చుంది బాగానేవుంది–ఆ కాళ్ళూపటం దేనికి ? అస్తమానూ కాళ్ళూపటమే—బట్టలమిషను తొక్కే అలవాటో ఏమిటో ! ఆ పిల్ల అలా కాళ్ళువూపుతోంటే నా మనస్సు అసహ్యంతో నిండిపోయింది. ఇక ఆ పిల్ల తాలూకు అందచందాలు నాకేంకన్పించలేదు. ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుని బయటడ్డాను. చూసీచూడగా అసహ్యంవేసిన పిల్లని ఎలా పెళ్ళిచేసుకోనూ ?" అంటూ ఎదురుప్రశ్న వేశాడు.

ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

[కరుణామయినుంచి]